సాక్షి
విజయనగరం
ఆదివారం । 10 । నవంబర్ । 2024



సర్వజన ఆస్పత్రిలో... హెచ్‌సీవీ కిట్ల కొరత - 8లో

సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ పరీక్ష కిట్ల కొరతతో రోగులు ఆందోళన చెందుతున్నారు.



డ్రాగా ముగిసిన రంజీ మ్యాచ్

ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఆంధ్రప్రదేశ్ - ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. - 8లో



పిల్లల ప్రాణాలపై నిర్లక్ష్యం తగదు

పిల్లల ప్రాణాలపై ఆస్పత్రులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఏఐ నైపుణ్యాలతో ఉపాధి

- ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్ సెమినార్‌లో ఐటీ ఎనలిస్ట్



ఏఐ అనలిస్ట్ దేవి పవన్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

విజయనగరం అర్బన్: యువత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంజినీరింగ్ కోర్సుతో ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు సాధించవచ్చని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనలిస్టు భాను పవన్ అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఏఐ సాంకేతికతపై విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరిశ్రమలు, రోజువారీ జీవితంలో ఏఐ ప్రభావాన్ని వివరించారు. డేటా ప్రాసెసింగ్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఆటోమేషన్ వంటి క్షేత్రాల్లో ఏఐ అవసరాన్ని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకునేందుకు ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. చివరిలో పవన్‌ను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ రాధ, డాక్టర్ జి.వేణుమాధవ్, డాక్టర్ టి.డి.వి.ఎ.నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'రైతే రాజు'



రైతేరాజు నాటికలో ఓ సన్నివేశం

విజయనగరం టౌన్: ప్రతిష్టాత్మక తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురజాడ కళాభారతి వేదికగా శనివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో విజయనగరం గురజాడ కళాభారతి వేదిక కళాత్మకతను సంతరించుకుంది. సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమైన నాటిక పోటీల్లో తెలంగాణా హైదరాబాద్‌కు చెందిన కళాంజలి సంస్థ చేసిన 'రైతే రాజు' ఆద్యంతం ఆహూతులను కట్టిపడేసింది. కంచర్ల సూర్యప్రకాష్ రచనలో, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వ ప్రతిభను చూపించారు. దేశం వెలుపల జవాన్, దేశం లోపల కిసాన్... వీళ్లు లేకపోతే ప్రజలు సుఖంగా బతకడం కష్టమని నాటికలో చక్కగా చూపించారు. రెండో ప్రదర్శనగా గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో గెద్ద కిశోర్ ఆత్మకథ బంధనం సాంఘిక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అభినయ సంస్థ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, ఐవీపీ రాజు, నాలుగెస్సుల రాజు, లోక్‌సత్తా రాష్ట్ర నాయకుడు భీశెట్టి బాబ్జీ, అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి అనాగరికం

విజయనగరం టౌన్: పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం అనాగరికమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌ఎస్‌వీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎమ్‌ఎస్‌ఎన్ రాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రెండు నెలల కిందట మంత్రి గుమ్మడి సంధ్యారాణి అనుచరులు చిందులపై ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిందని, ఆ విషయాన్ని సాక్షిలో వార్తగా ప్రచురితమైందన్నారు. ఆ మరుసటి రోజు మంత్రి ఖండన వార్త కూడా ప్రచురించారన్నారు. అక్కడితో ఆ అంశానికి తెరపడిందని పేర్కొన్నారు. దానినే తిరగదోడుతూ చల్లా కనకారావు అనే వ్యక్తి తాజాగా సాక్షి బ్యూరో చీఫ్ అల్లు సూరిబాబుపై సాలూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం తగదన్నారు. ఆయన మంత్రి గుమ్మడి సంధ్యారాణి అనుచరుడని జర్నలిస్టులుగా తమ పరిశీలనలో తేలిందన్నారు. ఫిర్యాదు అందుకున్న సాలూరు పోలీసులు ప్రాథమిక సూత్రాలను పక్కకు పెట్టి హుటాహుటిన విజయనగరం వచ్చి సూరిబాబుకు నోటీసులిచ్చి విచారణ నిమిత్తం సాలూరు పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకుం జారీచేయడం విచారకరమన్నారు. పోలీసుల అత్యుత్సాహాన్ని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులుగా గర్హిస్తున్నామన్నారు. పాత్రికేయులపై మానసిక, భౌతిక దాడులపై ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయులు స్వేచ్ఛగా విధులు నిర్వహించుకునే వాతావరణం కల్పించాలని వినమ్రంగా సూచిస్తున్నామన్నారు. అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని కోరారు.

అధికార పార్టీవారికి అలా...

ఆగిరేడు వీరాస్వామి... రాజాం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన అతను వైఎస్సార్‌సీపీ తరఫున సోషల్ మీడియాలో కాస్త ఉత్సాహంగా ఎన్నికల సమయంలో పనిచేశారు. దీంతో ఉక్రోషం పెంచుకున్న టీడీపీ కార్యకర్తలు ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జూన్ 18వ తేదీన అతని ఇంటిపై దాడి చేశారు. వీరాస్వామిపై దాడి చేశారు. తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోనే చికిత్స పొందాడు. దాడి చేసిన వ్యక్తులపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదుచేసి ఊరుకున్నారు. మరో విషయమేమిటంటే... వీరాస్వామే తమపై దాడిచేశారంటూ ప్రత్యర్థులు ఫిర్యాదుచేస్తే పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. ఇరువైపులా కేసులు ఉన్నాయి కాబట్టి రాజీ అయిపోవాలని బాధితుడు వీరాస్వామిపైనే ఒత్తిళ్లు తెస్తున్నారు.

కేతిరెడ్డి సాయికుమార్... బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన అతను వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాల్ నాయుడు వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ తరఫున సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవాడు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జూలై 14వ తేదీ రాత్రి కాపుగాసి టీడీపీ కార్యకర్తలు బొబ్బిలి నడిబొడ్డున దాడి చేశారు. శరీరమంతా దెబ్బలతో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందాడు. తనపై దాడి చేసినవారిపై సాయికుమార్ ఫిర్యాదు చేసినా పోలీసులు కనీసం కేసు కూడా నమోదు చేయలేదు.



అరాచక చర్యలకు అడ్డుకట్టవేయాలని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

ఇదేమి రాజ్యం? ఇదేనా ప్రజాస్వామ్యం?

- అధికార పార్టీ అరాచకాలపై వైఎస్సార్‌సీపీ నాయకుల గళం
- వైఎస్ జగన్ కుటుంబసభ్యులపై అసభ్య పోస్టింగ్‌లపై నిరసన
- ప్రశ్నించిన సోషల్ మీడియా కార్యకర్తలపైనా అక్రమ కేసులు
- పోలీసు వ్యవస్థను చేతిలో పెట్టుకొని అరాచకాలు
- ఆపకుంటే న్యాయపోరాటం చేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అధికారాన్ని ప్రజాసంక్షేమానికి గాకుండా టీడీపీ నాయకులు తమకు నచ్చనివారిపై కక్ష సాధింపునకు ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నదీ ఈ సంఘటనలే మచ్చుతునక. ఐదేళ్లూ సుపరిపాలన అందిస్తామని, సంక్షేమ పథకాలతో ముంచెత్తుతామని అరచేతిలో వైకుంఠం చూపించి తీరా అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపిస్తున్నారు. అంతేకాదు తమ చేతగానితనంపై ప్రజల దృష్టి మరల్చడానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబంపై అత్యంత దారుణమైన పోస్టింగ్‌లు సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారు. వాటిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు స్పందించిన దాఖలాల్లేవు. ప్రభుత్వం పరిపాలన పక్కనబెట్టి కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇస్తోందని ప్రశ్నించినా, ఆ పోస్టింగ్‌లను గ్రూపుల్లో ఫార్వార్డ్ చేసినా ఆగమేఘాలపై కేసులు నమోదుచేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అనే సందేహాలు కలుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారంటే అధికార పార్టీ పాలన ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. టీడీపీ కూటమి పాలన అధ్వానంగా ఉందని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉదాహరణలతో ఉతికిఆరేశారు.

• పోలీస్ దౌర్జన్యాలపై న్యాయపోరాటం

పోలీస్ యంత్రాంగం చంద్రబాబు, లోకేష్ గుప్పిట్లోకి వెళ్లి మానవ హక్కులను హరిస్తోందని, పోలీసుల దౌర్జన్యాలపై వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటం చేస్తుందని విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హెచ్చరించారు. ఇదే విషయాన్ని జిల్లా ఎస్పీకి స్పష్టం చేస్తూ శనివారం ఆయన జిల్లాకు చెందిన పలువురు నాయకులతో కలిసి విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావుకు మెమొరాండం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు, ఆ పార్టీ అఫీషియల్ పేజీల్లో తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిపైనా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా దుర్భాషలాడుతూ సైకోల మాదిరిగా వికృత చేష్టలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై తక్షణమే కేసులు నమోదుచేయాలని ఫిర్యాదు చేసినా పోలీసులు ఎక్కడా కూడా కేసులు నమోదుచేయలేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే అన్నివిధాలుగా విఫలమైందన్నారు. ఎన్నికల్లో వారిచ్చిన హామీలు, సూపర్ సిక్స్‌లు నెరవేర్చలేక క్లీన్‌బౌల్డ్ అయిపోయారని చెప్పారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. దాన్నే సోషల్ మీడియా వేదికగా, ప్రజాస్వామ్యబద్ధంగా చెబుతూ ఉంటే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్కసు వెళ్లగక్కుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితులపై సాక్షాత్తూ న్యాయమూర్తులే కోర్టుల్లో ఈ ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? ప్రభుత్వ పరిపాలన సాగిస్తుందా? పోలీసు వ్యవస్థ అసలు పనిచేస్తుందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. ఐదు నెలల కాలంగా అవినీతే లక్ష్యంగా ఇసుక, మద్యాన్ని మాత్రమే ప్రజల మధ్యకు తీసుకువచ్చారని చెప్పారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలిస్తే తెలుగుదేశం ప్రభుత్వం ఇంటింటికీ మద్యం తాగండనే పరిస్థితి తీసుకువచ్చారన్నారు. ఇంటింటికీ బెల్ట్‌షాపులు పెడుతున్నారని విమర్శించారు. ఉచితంగా ఇస్తామన్న ఇసుక ఎంత రేటు పెంచారో ప్రజలకు గమనిస్తున్నారన్నారు. గత ఐదు నెలలకాలంగా ఎక్కడా ఒక సంక్షేమ కార్యక్రమం లేదని చెప్పారు. తాగునీరిచ్చే పరిస్థితి లేదన్నారు. విద్య వ్యవస్థకు అవస్థలేనన్నారు. గత ప్రభుత్వంలో 'విద్య ముద్దు.. మద్యం వద్దు' అన్నామనీ, కానీ ఈ ప్రభుత్వం 'విద్య వద్దు... మద్యం ముద్దు' అంటున్నారని ఎద్దేవా చేశారు.

• జర్నలిస్టులపై కేసులు పెడితే సహించేది లేదు...

రెండు నెలల కిందట 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్తను పట్టుకొని జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకూ సమంజసమని చిన్న శ్రీను ప్రశ్నించారు. తక్షణమే ఇటువంటివాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నెక్కల నాయుడుబాబు, కేవీఆర్ సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, పీరుబండి జైహింద్ కుమార్, రేగాన శ్రీను, వర్రి నరసింహమూర్తి, మామిడి అప్పలనాయుడు, సంజీవి, గొర్లె రవికుమార్, కెల్ల శ్రీను, ఆశపు వేణు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై ఇలా...

సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి మంత్రి పదవి వచ్చిన సంతోషంలో సుమారు రెండు నెలల కిందట ఆమె అనుచరులకు, రెండు దినపత్రికల (సాక్షి కాదు) విలేకరులకు ప్రత్యేక సిఫారసు లేఖలతో తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించారు. కొద్దిరోజుల్లోనే ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో మంత్రి అనుచరులు చిందులేస్తున్నారంటూ ఆ వీడియోలో ఉంది. అదే విషయాన్నే 'సాక్షి' రిపోర్టు చేసింది. 'దైవసన్నిధిలో టీడీపీ కార్యకర్తల చిందులు' శీర్షికతో సెప్టెంబర్ 17వ తేదీన వార్త ప్రచురించింది. అయితే ఆ నృత్యాలు చేసింది తిరుపతిలో కాదని, అంతకుముందే విజయవాడలో తమ కుమారుడి పుట్టినరోజు వేడుకల్లో చేసినవని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆ వార్తను ఖండిస్తూ ఇచ్చిన ప్రకటననూ ఆ మర్నాడే 18వ తేదీన 'ఆ వీడియో దైవసన్నిధిలోనిది కాదు' అనే శీర్షికతో వార్త ప్రచురించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రసారంలో వాస్తవం లేదన్న ఆమె వాదనను అందులో ప్రస్తావించింది. సాధారణంగా రాజకీయాల్లో ఏవైనా ఆరోపణలు వచ్చినప్పుడు వారి వివరణ ఇస్తే అంతటితో తెరపడుతుంది. రెండు నెలల తర్వాత ఆ వార్తలో ఎలాంటి ప్రస్తావన లేని చల్లా కనకారావు అనే వ్యక్తి వచ్చి ఫిర్యాదు చేస్తే సాలూరు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసేశారు. ఆగమేఘాలపై విజయనగరం వెళ్లి సాక్షి బ్యూరోచీఫ్ అల్లు సూరిబాబుకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. పోలీసుల తీరును జర్నలిస్టు సంఘాల నాయకులు, రిపోర్టర్లు ముక్తకంఠంతో ఖండించారు. తప్పుడు కేసులు సరికాదని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీని సైతం కలిసి వినతిపత్రం అందించారు.



టీడీపీ సోషల్ మీడియా చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని మీడియాకు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్

పాత్రికేయుల ధర్నా



ఎస్పీ కార్యాలయం వద్ద పాత్రికేయుల నిరసన

సాక్షి, పార్వతీపురం మన్యం: సమాజంలోని ఘటనలను వెలుగులోకి తేవడమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యతని.. కలం స్వేచ్ఛ గొంతునొక్కేలా పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గపు చర్య అని ఏపీయూడబ్ల్యూజే పేర్కొంది. 'సాక్షి' ఉమ్మడి విజయనగరం జిల్లా బ్యూరో చీఫ్ అల్లు సూరిబాబుపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. 'సాక్షి' ప్రతినిధిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో పాత్రికేయులు శనివారం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని.. తమకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎస్పీ మాధవ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కిశోర్, ఉపాధ్యక్షులు జయంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం ప్రకటించిన వైఎస్సార్‌సీపీ

పత్రికా స్వేచ్ఛపై దాడిని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. పాత్రికేయుల ధర్నా కు పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావు సంఘీభావం తెలిపారు.

మీడియాపై దాడులా

తమకు తెలిసిన విషయాన్ని ప్రజలకు చేరవేసే ఉద్దేశంతో మీడియా పరుగులెడుతుంది. ఈ సమయంలో కొన్నిచోట్ల పొరపాట్లు జరగవచ్చు. దానికి ఖండన వార్తలు కూడా ప్రచురిస్తుంది. అలాంటి సమయంలో తప్పుడు కేసులు బనాయించడం తగదు. విజయనగరం జిల్లా సాక్షి ప్రతినిధిపై టీడీపీ మంత్రి పెట్టించిన కేసు పత్రికా స్వేచ్ఛను హరించేలా ఉంది.

– ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, ఏపీడబ్ల్యూజేయూ జిల్లా సహాయకార్యదర్శి, రాజాం

ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయడమే..



మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయడమే. తమకు తెలిసిన విషయాన్ని బయట ప్రపంచానికి చేరవేసే వారధులు జర్నలిస్టులు. అటువంటి జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి అణగదొక్కాలనుకోవడం అమానుషం. విజయనగరం సాక్షి ప్రతినిధిపై టీడీపీ మంత్రి పెట్టించిన అక్రమ కేసును వెంటనే వెనక్కుతీసుకోవాలి. పోలీసులు ఈ ఘటనపై పునరాలోచించాలి. మీడియా ప్రతినిధులను భయపెట్టి పాలనచేయాలనుకుంటే ప్రజలు నుంచి వ్యతిరేకత తప్పుదు. అధికారం శాశ్వతం కాదనేది పోలీసులు గుర్తించాలి.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి

అక్రమ కేసులు తగవు



కూటమి ప్రభుత్వం వింత పోకడలకు పోయి ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే మీడియాను, సోషల్ మీడియా కార్యకర్తలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోంది. అక్రమంగా కేసులు బనాయిస్తోంది. రాజ్యాంగంలో సూచించిన ఫోర్త్ ఎస్టేట్ నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోంది. ఏపీలో మీడియా ప్రతినిధులపై జరుగుతున్న దాడులు, నమోదవుతున్న కేసులు గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది రాజ్యాంగ విరుద్ధం. సోషల్ మీడియా కార్యకర్తలు అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వివిధ కేసుల్లో ఇరికించి చిత్ర హింసలకు గురిచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు. ఈ తరహా వైఖరి విడనాడాలి.

– నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్

క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిత



భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


భోగాపురం: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల అండర్-14 వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు విజయనగరం జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో చదువుకుంటున్న క్రీడాకారులకు ప్రభుత్వం రూ.7.40 కోట్లు (సమగ్ర శిక్షణ నిధులు)ను కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచూపి వచ్చేనెల 10 నుంచి 14వ తేదీ వరకు వారణాసిలోని కాశీలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. డీఈఓ యు.మాణిక్యంనాయుడు, జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను కలెక్టర్‌కు పరిచయం చేశారు. పోటీల ప్రారంభానికి ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఎస్‌జీఎఫ్ సెక్రటరీ టి.వి.భగవాన్‌దాసు, ఈఓ కె. వెంకరమణ, డీఎస్‌డీఓ కె.వెంకటేశ్వరరావు, డీపీఏలు బీవీఎస్‌వీ ప్రసాద్, కె.చిన్నంరాజు, కేవీఎన్ రాజు, కె.సన్యాసినాయుడు, ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, పీడీలు చిన్నారి, నాగన్న, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనకు గుర్తింపు

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

విజయనగరం అర్బన్/బొబ్బిలి/ఎస్.కోట: జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో బొబ్బిలి పట్టణంలోని శ్రీవేణుగోపాల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిట్టిమోజు ఉషారాణి, విజయనగరం మండలంలోని మలిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కె.ఒ.వి.ఎస్.ఎస్.ఎన్.ఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్.కోట మండలం ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు తమ్మినాన రాజేష్ ఉన్నారు. వీరికి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

బోధనలో 'ఉష'స్సులు



బొబ్బిలి శ్రీ వేణుగోపాల మున్సిపల్ ఎలిమెంటరీ హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న **చిట్టిమోజు ఉషారాణి**ది పిరిడి గ్రామం. 24 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. బొబ్బిలి పట్టణంలోని నేతాజీ, జయప్రకాష్, వేణుగోపాల మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ ప్రత్యేక బోధనా సరళితో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు 'సుబోధని' పేరుతో ఓ యూట్యూబ్ చానల్‌ను నడుపుతున్నారు. అందులో వినూత్న విద్యాబోధనలు, కొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తుంటారు. ఎస్‌ఈఆర్‌టీ రూపొందించే పాఠ్యపుస్తకాల రచనల్లోనూ పాలు పంచుకున్నారు. ఆమె ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాలను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం అలవాటు. పిల్లల విద్యాభివృద్ధికి శక్తి వంచనలేకుండా పనిచేస్తారు. ప్రాథమిక స్థాయిలోనే చదువుకు గట్టిపునాది వేస్తారు.

అవార్డుల మా'స్టార్'



ధర్మవరం జెడ్పీ హైస్కూల్‌లో పీజీటీగా పనిచేస్తున్న **తమ్మినాన రాజేష్** 2003లో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. సులభ పద్ధతుల్లో బోధించడంలో ఆయన మా'స్టార్'. 2005 నవంబర్‌లో మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా విధుల్లో ప్రవేశించారు. అయితే, ధర్మవరం హైస్కూల్ ప్లస్‌లో రసాయన శాస్త్రం బోధకునిగా నియామకయ్యారు. శాస్త్ర విజ్ఞానంలో ఆయనకు మంచి పట్టు ఉంది. విద్యార్థులు చిరకాలం గుర్తించుకునేలా బోధన సాగించడంలో ఆయన దిట్ట. అందుకే ఆయనను అవార్డులు వరిస్తున్నాయి. 2023లో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం విగాన గురుపురస్కార్, 2017లో తిరుపతిలోని సీపీఎస్‌కే తేజ చారిటీస్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2018లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురుదేవోభవ అవార్డు, 2021లో బెంగుళూరులో భరత్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. 2019లో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మెరిట్ సర్టిఫికెట్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మూడు సార్లు జాతీయ స్థాయిలో, ఆరుసార్లు రాష్ట్రస్థాయికి చేరుకున్నారు. 2016లో మహారాష్ట్ర సర్కారు నుంచి బారామతి బంగారు పతకం, 2019లో కేరళ ప్రభుత్వం నుంచి బంగారు పతకం, 2020లో ఆన్‌లైన్‌లో బంగారు పతకం, 2022లో ఆజాద్ కా అమృతమహోత్సవ్ జిల్లా విజేత, బెంగుళూరులో జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ ఫ్రో-2018లో మొదటి స్థానం, 2017, 2018, 2019లో ఏపీ స్టేట్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ మెరిట్ అవార్డులు అందుకున్నారు. బెంగుళూరులో జరిగిన ఎస్ఐఎస్ఎఫ్-2019, ఎన్‌సీఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ మొదటి బహుమతి సాధించారు. 2020లో ప్రపంచ సముద్ర శాస్త్ర బహుమతి విజేతగా నిలిచారు.

శాస్త్ర విజ్ఞానానికి అవార్డు



భౌతిక శాస్త్రంలో మంచి పట్టు ఉన్న ఉపాధ్యాయుడిగా మలిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు **సుబ్రహ్మణ్యం**కు జిల్లాలో గుర్తింపు ఉంది. విద్యార్థుల్లో శాస్త్ర జ్ఞానాన్ని పెంపొందించడం, విజ్ఞాన ప్రదర్శనల్లో పాల్గొనేందుకు అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనలో సాయపడడం, భౌతికశాస్త్ర పరిశోధనలు, ఆవశ్యకత వంటి అంశాలను వివరిస్తూ.. భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో ఆయనకు ఆయనే సాటి. ఎనిమిది సార్లు రాష్ట్ర శాస్త్ర ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆయన విజ్ఞానాన్ని, బోధనను ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. ఆయన ఇప్పటికే జాతీయ బాలల శాస్త్ర కాంగ్రెస్‌లో ఉత్తమ సమన్వయకర్త అవార్డు, విక్రమ్ సారాబాయ్ జాతీయ అవార్డు, ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.

క్లుప్తంగా

వెంకన్నను దర్శించుకున్న జబర్దస్ నటుడు



భర్తాపురం వెంకన్నస్వామి సన్నిధిలో బుల్లితెర నటుడు సత్తిపండు

శృంగవరపుకోట: బుల్లితెర నటుడు జబర్దస్త్ ఫేం సత్తిపండు మండలంలో భర్తాపురం గ్రామంలోని కల్యాణ ప్రసన్న వైభోగ వేంకటేశ్వరస్వామిని శనివా రం దర్శించుకున్నారు. అరుకులో షూటింగ్ కోసం వెళ్తున్న సత్తిపండు మార్గ మధ్యంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. ఆలయ నిర్వాహకులు సత్తిపండుకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకన్న స్వామి కృప వల్ల తాను ఈ స్థాయిలో ఉన్నానంటూ చెప్పారు.

దిబ్బగూడలో పూరిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట: మండలంలోని కీసర జోడు పంచాయతీ దిబ్బగూడ గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సున్నాపురం నాగరాజుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. కొత్తూరు అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. ఇంట్లో ఉన్న బియ్యం, ధాన్యం, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం సంభవించినట్టు అంచనా వేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన సంతోషిని చికిత్స కోసం తరలిస్తున్న 108 సిబ్బంది

గంట్యాడ: మండలంలోని నరవ జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనసాం గ్రామానికి చెందిన మహిళ తీవ్రంగా గాయపడింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో గ్రామానికి చెందిన కె.సంతోషి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం 108 వాహనంలో విజయనగరంలోని మహరాజా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం దుకాణంపై మహిళల నిరసన



వల్లంపూడి స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

వేపాడ: మండల కేంద్రంలో మద్యం దుకాణాన్ని గృహావాసాల మధ్య పెట్టడంపై మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వేపాడలోని మధు బుక్ సెంటర్ ఎదురుగా ఉన్న గదిలో మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయతిన్ంచగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం పెడితే తామంతా ఇబ్బంది పడతామని తెలిపారు. అనంతరం వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మహిళలు తమ ఇబ్బందులు వివరించి ఫిర్యాదు చేశారు.

కొట్లాట కేసు నమోదు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్లే రహదారి వద్ద శనివారం రాత్రి కొట్లాట జరిగింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ ఎస్‌ఐ నరేష్ శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ మెట్టక్కివలస బలివాడవారి వీధికి చెందిన గొర్రెల రాంబాబుతో పాటు యాచకవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ మహిళ, ఆమె భర్త నూడిల్స్ తింటున్నారు. ముగ్గురూ మద్యం సేవించి ఉన్నారు. రాంబాబు వీడియో కాల్ చేసి మాట్లాడుతుంటే భార్యాభర్తలిద్దరూ తమకెందుకు ఫొటోలు తీస్తున్నావంటూ ప్రశ్నించారు. రాంబాబు తను ఫొటోలు తీయలేదని చెప్పినా ఆయనతో వాగ్వివాదానికి దిగారు. అంతటితో ఆగకుండా రాంబాబుపై వారు దాడికి దిగారు. తీవ్రంగా కొట్టడంతో రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి నిలువరింపజేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్‌ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడిని 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

సర్వజన ఆస్పత్రిలో...

హెచ్‌సీవీ కిట్ల కొరత

- ఈ పరీక్ష తరువాతే ఆపరేషన్లు
- ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న రోగులు
- రూ.200 నుంచి 300 వరకు ఖర్చు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎస్.అప్పారావు. ఇతనిది బొబ్బిలి గ్రామం. ఈయన కొంత కాలంగా కడుపు నొప్పి వస్తుండడంతో సర్వజన ఆస్పత్రికి వచ్చారు. అక్కడి వైద్యులు అతన్ని పరీక్షించి హెర్నియాగా గుర్తించి శస్త్రచికిత్స చేయాలని సర్జికల్ ప్రొఫెయిల్‌తో పాటు, హెచ్‌ఐవి, హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అది పట్టుకుని ల్యాబొరేటరీ వద్దకు అప్పారావు వెళ్లగా హెచ్‌సీవీ పరీక్ష కిట్లు లేవని బయట చేయించుకోవాలని అక్కడ సిబ్బంది చెప్పడంతో ప్రైవేటు ల్యాబ్‌రేటరీకి ఎక్కడకు వెళ్లాలో తెలియక ఆస్పత్రి కలియతిరిగాడు.



హెచ్‌సీవీ కిట్టు



వైద్య పరీక్షల కోసం సర్వజన ఆస్పత్రికి వచ్చిన రోగులు

కిట్ల కొరత వాస్తవమే..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ పరీక్ష కిట్లు కొరత ఉంది. వీటి కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖ ద్వారా తెలియజేశాం. ఈ కిట్లు ఎన్‌హెచ్‌ఎం ప్రొగ్రాం ద్వారా సరఫరా అవుతుంటాయి.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ పరీక్ష కోసం రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడకు వచ్చే రోగులకు శస్త్రచికిత్స అవసరమైతే వైద్యులు హెచ్‌సీవీ(హెపటైటీస్ సీ వైరస్), హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు. వీటిలో ఏ పరీక్ష జరగకపోయినా వారికి శస్త్రచికిత్స చేయరు. వీటిలో ఏ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ జరిగినా వారికి ప్రత్యేకమైన కిట్లు ధరించి ఆపరేషన్లు చేస్తారు.

ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి

ఆస్పత్రిలో హెచ్‌సీవీ కిట్లు కొరత ఉండడంతో ఈ పరీక్ష అవసరమైన రోగులకు ప్రైవేటు ల్యాబ్‌లో చేయించుకోవాలని అక్కడ సిబ్బంది సూచిస్తున్నారు. శస్త్రచికిత్స అవసరమైన ప్రతి ఒక్క రోగి హెచ్‌సీవీ పరీక్ష చేయించుకోవాలి. ప్రతి రోజు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి హెచ్‌సీవీ పరీక్ష కోసం 50 నుంచి 70 మంది వరకు వస్తారు. ఆస్పత్రిలో కిట్లు కొరత వల్ల వీరంతా ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థో, కంటి, సర్జికల్, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించి శస్త్రచికిత్సలు చేస్తారు. హెచ్‌సీవీ పరీక్షకు ప్రైవేట్ ల్యాబ్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు వెచ్చించి రోగులు చేయించుకుంటున్నారు.

రిపోర్టు లేకుంటే అంతే..

హెచ్‌సీవీ పరీక్ష లేకపోతే సంబంధిత రోగులకు శస్త్ర చికిత్సలు జరగని పరిస్థితి. ఈ పరీక్ష రిపోర్టు ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. లేని వారికి ఆపరేషన్లు వాయిదా వేస్తున్నారు. హెచ్‌సీవీ ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి నిర్ధారణ అయితే వారికి కాలేయం దెబ్బతింటుంది. లివర్ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో రోగుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పిల్లల ప్రాణాలపై నిర్లక్ష్యం తగదు

- బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

చీపురుపల్లి: పిల్లల ప్రాణాలపై ఆస్పత్రులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పట్టణంలోని బాబూజీ ఆస్పత్రిలో ప్రసవ సమయంలో మగబిడ్డ మృతి చెందిన ఘటనపై శనివారం ఆయన ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి వచ్చి విచారణ నిర్వహించారు. బిడ్డ మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణి ఎప్పుడు ఆస్పత్రిలో చేరింది, ఏ సమయంలో ప్రసవం చేసారు, బిడ్డ ఎలా మృతి చెందింది.. అనే అంశాలపై ప్రశ్నలు వేసారు. పిల్లల కోసం వేలాది దరఖాస్తులు తమ కమిషన్ వద్ద ఉన్నాయని అలాంటిది పిల్లలు ఇలా నిర్లక్ష్యం కారణంగా మృతి చెందడం చాలా బాధాకరమని చెప్పారు. పేదలైనా ధనికులైనా ప్రాణం అందరికీ సమానమేనని గుర్తు చేసుకోవాలన్నారు. గర్భిణి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి సీసీ పుటేజీలతో పాటు పూర్తి వివరాలు కమిషన్‌కు సమర్పించాలన్నారు. గర్భిణుల ప్రసవసమయాల్లో మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రుల్లో చేరినప్పుడు వారికి సరైన వైద్యం అందుతుందో లేదో మహిళా పోలీసులు బాధ్యతగా తెలుసుకోవాలన్నారు. ఎంతో గొప్ప ఆశయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో మహిళా పోలీసులను నియమించినట్లు చెప్పారు. మహిళా పోలీసులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ ఎన్.ఆరుద్ర, చైల్డ్ లైన్ సిబ్బంది వి.మీనా, పి.గౌరి, సీహెచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ సాధన కమిటీ ఏర్పాటు



సాధన కమిటీ నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: కాంట్రాక్ట్ అధ్యాపకులు క్రమబద్ధీకరణ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు స్థానిక ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశమయ్యారు. జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్రమబద్ధీకరణ సాధన కమిటీ గౌరవ అధ్యక్షురాలుగా లంక సంధ్య, కమిటీ గౌరవ సలహాదారులుగా సూర్యనారాయణ, చందక అప్పలనాయుడు, కేవీఎస్ రామారావును ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మండల సూరపనాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం.శరత్ కొత్తవలస, బి.అప్పారావు, ప్రధాన కోశాధికారిగా ఎన్.సన్యాసినాయుడు, ఎన్.భద్రావతి, మహిళ కోఆర్డినేటర్ కార్యదర్శులుగా వి.ఉమామహేశ్వరి, శ్యామలాదేవి, మీడియా కనీనర్‌గా కరణం రామకృష్ణ, సాంకేతిక సలహాదారుగా రెడ్డి కిషోర్ ఎంపికయ్యారు. నూతన కమిటీ బాధ్యతలు తీసుకున్న అనంతరం జరిగిన సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు క్రమబద్ధీకరణ సాధనకు విధివిధానాలు, కార్యాచరణ రూపకల్పన చేశారు. సమావేశంలో సూర్యనారాయణ, కేవీఎస్ రామారావు, చందక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

విజయనగరం క్రైమ్: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంవీ నిబంధనలు అతిక్రమించిన 531 వాహనదారుల వాహనాలను సీజ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎమ్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు పర్యవేక్షించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- కక్ష కట్టి హత్య చేసిన స్నేహితుడు
- పోలీసుల వెల్లడి



మాట్లాడుతున్న సీఐ రవికుమార్, వెనుక ముసుగులో నిందితుడు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో రెండు రోజుల కిందట జరిగిన యువకుడి హత్య కలకలం రేపిన సంగతి పాఠకులకు విదితమే. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జామి పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరజనార్దన్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజినిగిరి గ్రామానికి చెందిన గనివాడ అచ్చింనాయుడు, వి.సూరిబాబు స్నేహితులు. రెండు నెలల కిందట సూరిబాబు గ్రామంలో ఒక సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. దీన్ని అచ్చింనాయుడుకు అమ్మేయమని ఇచ్చాడు. అచ్చింనాయుడు జామిలో ఒక సెల్‌షాపులో సెల్‌ఫోన్‌ను విక్రయించాడు. బాధితులు పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ పట్టుకున్నారు. ఈ ఘటనపై గ్రామ పెద్దలు నగదు, సెల్‌ఫోన్‌కు సంబంధించి ఇద్దరూ చెరో రూ.3వేలు చొప్పున ఇవ్వాలని జరిమాన విధించారు. దీన్ని సహించలేని సూరిబాబు అచ్చింనాయుడుపై చిందులేశాడు. నా పేరు ఎందుకు బయటపెట్టావు..నిన్ను చంపుతానని రెండు నెలల కిందట బెదిరించాడు. దీంతో అచ్చింనాయుడు రెండు నెలల పాటు గ్రామంలో లేకుండా వెళ్లిపోయాడు. ఈ నెల 7న గ్రామానికి మళ్లీ వచ్చాడు. ఈ క్రమంలో సూరిబాబు అచ్చింనాయుడును కలిసి జరిగింది మరచిపోదాం.. అని చెప్పడంతో వారిద్దరూ గ్రామంలోని బెల్ట్ షాపునకు వెళ్లి మద్యం సేవించి గురువారం గొడవ పడ్డారు. ఈ క్రమంలో సూరిబాబు గురువారం రాత్రి అచ్చింనాయుడుపై దాడి చేసి బలంగా కొట్టి చంపేశాడు. అచ్చింనాయుడు మృతదేహాన్ని గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడేశాడు. విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు చిత్రీకరించాడు. జరిగిన ఘటనపై మృతుడి అక్క కొండమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రవికుమార్ విచారణ జరిపి నిందితుడు సూరిబాబును అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అచ్చింనాయుడును తానే కక్షగట్టి హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడిని విలేకరుల సమావేశంలో పోలీసులు ప్రవేశపెట్టారు. నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్టు సీఐ రవికుమార్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన గౌరినాయుడు మృతదేహం

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక జంక్షన్ వద్ద జాతీయ రహదారి 26పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన లోగిస గౌరినాయుడు(50) విజయనగరంలోని ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న రైతుబజారులో కూరగాయలు రోజూ విక్రయిస్తూ ఇంటికి వస్తుంటాడు. రోజూ లాగే శనివారం కూడా తన బైక్‌పై విజయనగరం నుంచి నెలివాడకు గోట్లాం గ్రామానికి చెందిన మీసాల ఈశ్వరరావుతో కలిసి వస్తుండగా గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌరినాయుడు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరంలోని మహరాజ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అప్పలసూర్యంతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

వ్యాన్ కేబిన్‌లో నుంచి జారిపడి డ్రైవర్ మృతి

రేగిడి: ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు కర్మాగారం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌లో నిద్రిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత కిందపడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పి.నీలావతి తెలిపిన వివరాలు.. విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం కోడూరు అగ్రహారానికి చెందిన జోగి గోవింద (55) ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఐచర్ వ్యాన్‌తో తవుడు లోడుతో వచ్చాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి క్యాబిన్‌లోనే నిద్రించాడు. నిద్ర మత్తులో గోవింద్ కింద పడిపోవడంతో కాలు స్టీరింగ్‌లో ఇరుక్కుని వేలాడుతూ ఉండిపోయాడు. శనివారం కుటుంబ సభ్యులు గోవింద్‌కు ఫోన్ చేసినప్పటికీ విషయం తెలియరాలేదు. విషయాన్ని స్థానిక కర్మాగార సిబ్బందికి తెలియజేశారు. వారు వెళ్లి చూడగా ఐషర్ వ్యాన్‌లో గోవింద ఇరుక్కుని పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో కలసి సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డ్రాగా ముగిసిన రంజీ మ్యాచ్



ఆంధ్రా - ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్



బ్యాటింగ్ చేస్తున్న ఆంధ్రా ఆటగాళ్లు

విజయనగరం: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఆంధ్రప్రదేశ్ – ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. గత నాలుగు రోజులుగా డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న మ్యాచ్‌లో చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారులు ఉత్తరాఖండ్ బౌలర్లను సమర్థవంతంగా తిప్పికొట్టడంలో సఫలమయ్యారు. 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు ఓవర్‌నైట్ స్కోరు వద్ద నాల్గవ రోజు శనివారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 286 పరుగులు చేసింది. జట్టు బ్యాటింగ్‌లో కెప్టెన్ ఎస్‌కె.రషీద్ 60 బంతుల్లో 31 పరుగులు, కరణ్ షిండే 171 బంతుల్లో 65 పరుగులు, హనుమ విహారి 189 బంతుల్లో 66 పరుగులు, కెఎస్.భరత్ 90 బంతుల్లో 92 పరుగులతో రాణించారు. చివరి రోజు మ్యాచ్ ఫలితం తేలకపోవటంతో అంపైర్‌లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 56.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైన విషయం విదితమే. అదే విధంగా మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ జట్టు మొత్తం 135.2 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ కాగా... రెండవ ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 128 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



గొండయ్యపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



గొండయ్యపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

డెంకాడ: అర్హులైన వారంతా ఓటు హక్కు పొందాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. డెంకాడ మండలం మోదవలస పంచాయతీలోని గొండయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో బూత్ నంబర్ 17ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తనిఖీ చేశారు. బూత్ పరిధిలో ఓటర్ల సంఖ్య, కొత్తగా వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై బీఎల్‌ఓను ఆరా తీశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా యువ ఓటర్లకు అవగాహన కల్పించి, వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేయాలన్నారు. ఇందుకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ – 2025 కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో అలాగే 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక తేదీల్లో బీఎల్‌ఓ అంతా ఇక్కడ అందుబాటులో ఉంటారని తెలిపారు.

పాఠశాల సందర్శించిన కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై ఆరా తీశారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు, తహసీల్దార్ పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



హైకోర్టు న్యాయమూర్తులు జయసూర్య, సురేష్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఆలయ అర్చకులు, అధికారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ కె.సురేష్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వారికి ఆహ్వానం పలికారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్న తరువాత శ్రీరామచంద్రమూర్తి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చరణలతో అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటాలను అందజేశారు. ఈ సందర్భంగా రామక్షేత్ర మహాత్యాన్ని అర్చకులు న్యాయమూర్తులకు వివరించారు. ఈఓ వై.శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, జిల్లా కోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.